

సెల్యూట్.. హైమన్ 8లో▸

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టీ ఎలిజబెత్ దంపతుల వర్ధంతిని మార్లావాయిలో ఘనంగా నిర్వహించారు. ఆత్మబంధువులకు నివాళులర్పించారు.



జనసంద్రంగా దీక్షభూమి

నార్నూర్ మండలం కొత్తపల్లి-హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్షభూమి జనసంద్రమైంది. బుధవారం గురుకృప దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/14.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచుతో పాటు రాత్రివేళలో చలిప్రభావం కొనసాగనుంది.

న్యూస్‌రీల్

'మహా' ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అనిల్‌జాదవ్

నేరడిగొండ: మహారాష్ట్ర ఎమ్మెల్యే మాధవరావు పటేల్ బుధవారం జెడ్పీటీసీ రాథోడ్ సుభాష్‌తో కలిసి మండల కేంద్రంలోని జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ ఇంటికి బుధవారం వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ వారిని శాలువాలతో సన్మానించారు. ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, నలేగాం సర్పంచ్ పాండు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఐకేరెడ్డి

నేరడిగొండ: నిర్మల్‌లోని తన నివాసంలో రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకులు మంత్రికి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పార్వతీ సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటుకం మధుకర్, ఉపాధ్యక్షుడు మోహన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్, ప్రధానకార్యదర్శి నికేశ్‌జాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20లోపు క్రీడాప్రాంగణాల పనులు పూర్తిచేయాలి



భీంపూర్‌లో మాట్లాడుతున్న కిషన్

తాంసి: ఈ నెల 20లోపు తెలంగాణ క్రీడా ప్రాంగణాల పనులు పూర్తిచేయాలని డీఆర్డీవో కిషన్ సూచించారు. బుధవారం భీంపూర్ మండలం నిపాని, భీంపూర్ మండల కేంద్రంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, ప్రకృతి వనాలను ఏపీడీ రాథోడ్ రవీందర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీలో చేపడుతున్న పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో 1,176 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయనుండగా 963 చోట్ల స్థలాలు గుర్తించినట్లు చెప్పారు. పనులు పూర్తయిన గ్రామాలకు ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లు అందజేస్తుందని తెలిపారు. ఆయన వెంట జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సూర్యప్రకాశ్, ఏపీవో సంగీత, ఈసీ నరేందర్, టీఏలు అనసూయ, మజార్, రాకేశ్, వినోద్ తదితరులున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రూప్‌దేవ్

నార్నూర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఖందేవ్ జాతరలో భాగంగా కబడ్డీ పోటీలను బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, ఉుడందెబ్బ మండలాధ్యక్షుడు కనక ప్రభాకర్, కార్యదర్శి మానిక్‌రావు తదితరులున్నారు.

నేడు 'చలో కలెక్టరేట్'



నినదిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రైతు సంఘం పిలుపు మేరకు గురువారం 'చలో కలెక్టరేట్' నిర్వహించనున్నట్లు నాయకుడు బండి దత్తాద్రి తెలిపారు. బుధవారం ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొండ రమేశ్, విజ్జగిరి నారాయణ, కేమ లక్ష్మణ్, రూపేశ్‌రెడ్డి, చిలుక దేవిదాస్, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



తాంసి మండలం జామిడి శివారులోని ఓ చేనులో కంది కట్టలు

కలిసొచ్చిన కంది



ఈ రైతు పేరు పాల్త్రోజ్ ఓమేశ్. తాంసి మండలం సావర్గాం గ్రామం. తనకున్న ఐదెకరాల్లో పత్తితో పాటు అంతరపంటగా కంది సాగు చేశాడు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాడు. ప్రైవేట్‌లో ప్రస్తుతం ధర అధికంగా ఉండగా నూర్పిడి తర్వాత విక్రయించాలని భావిస్తున్నాడు.

- ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న దిగుబడి
- పంట నూర్పిడి పనుల్లో రైతులు
- 'మద్దతు'ను మించిన ప్రైవేట్ ధర
- ఆనందం వ్యక్తంజేస్తున్న రైతులు
- ఇంకా ధర పెరుగుతుందని ఆశలు

జిల్లాలో కంది సాగు వివరాలు
సాగు విస్తీర్ణం : 65,579 ఎకరాలు
దిగుబడి అంచనా : 3,27,895 క్వింటాళ్లు
మద్దతు ధర : రూ.6,600
ప్రైవేట్ ధర : రూ.7వేలు

ఇంకా ధర పెరుగుతుందని..

ప్రస్తుతం కంది పంట చేతికొస్తోంది. ప్రైవేట్‌లో ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇంకా ఏమైన పెరుగుతుందా.. అని రైతులు నిరీక్షిస్తున్నారు. ఈ పంటను రాష్ట్రంలో నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. దానికి అనుబంధంగా జిల్లాలో మార్క్‌ఫెడ్ కందులను కొనుగోలు చేస్తోంది. అయితే మద్దతు ధరకు మించి ప్రస్తుతం ప్రైవేట్‌లో ధర ఉండగా ప్రభుత్వం కొనుగోళ్ల కోసం వేచిచూసే ధోరణి అవలంబిస్తోంది.

ప్రణాళిక రూపొందిస్తున్నాం



కందికి మద్దతు ధరను మించి ప్రైవేట్‌లో రేటు పలుకుతోంది. ఒకవేళ ధరలో ఒడిదుడుకులు ఉంటే మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సిద్ధంగా ఉంది. గతంలో ఎనిమిది కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో కందులు కొనుగోలు చేశాం. ప్రస్తుతం కూడా ప్రణాళిక రూపొందిస్తున్నాం. – గౌరి నాగేశ్వర్‌రావు, డీఎం, మార్క్‌ఫెడ్, ఆదిలాబాద్

సాక్షి, ఆదిలాబాద్: ఈసారి కంది రైతులకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. వానాకాలంలో పత్తి, సోయా తర్వాత జిల్లాలో అత్యధికంగా సాగయ్యే కంది ప్రస్తుతం చేతికొస్తోంది. చేలల్లో పంటను కోస్తూ రైతులు బిజీగా కనిపిస్తున్నారు. పెద్ద మొత్తంలో సాగు చేసిన రైతులు హార్వెస్టర్ల ద్వారా, స్వల్పంగా సాగు చేసిన వారు క్రషర్ యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్నారు. సంక్రాంతి తర్వాత జిల్లాలో కంది కొనుగోళ్లు జోరందుకోనున్నాయి. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరను మించి ప్రస్తుతం ప్రైవేట్‌లో అధిక ధర లభిస్తుండగా రైతులు సంబురపడుతున్నారు.

పత్తి, సోయాకు కూడా ప్రైవేట్‌లోనే..

పత్తికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,380 ఉండగా, మొదటి నుంచి ప్రైవేట్‌లో అంతకుమించిన ధరే పలుకుతోంది. కొనుగోళ్లు ప్రారంభమైనప్పుడు రూ.8,300 ఉండగా, ఆ తర్వాత రూ.9వేలకు పైగా పలికింది. దీంతో రైతులు రూ.10 వేల వరకు ధర పెరుగుతుందని ఆశించారు. పంట దిగుబడులను నిల్వ చేసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని మార్కెట్లో పత్తికి సంబంధించి నామమాత్రంగా 3లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. సోయాబీన్‌ది ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో సుమారు 70వేల ఎకరాల వరకు సాగైంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,300 ఉండగా, మొదటి నుంచి ప్రైవేట్‌లో అంతకుమించిన ధరే లభిస్తోంది. ప్రస్తుతం రూ.5,400 వరకు ధర పలుకుతోంది. రైతులు ఈ పంటకు కూడా ప్రైవేట్‌లో ధర పెరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో కాకపోయినప్పటికీ కొంత మొత్తం సోయా దిగుబడులను కూడా నిల్వ చేసి ఉంచారు.

డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్



- 60మందికి పైగా విద్యార్థుల డిబార్
- బుధవారం ఒక్కరోజే 24 మంది..
- తరచూ స్క్వాడ్లతో వాగ్వాదం
- తాజాగా స్క్వాడ్ కారుపై దాడి
- ప్రైవేట్ కళాశాలల తీరుపై అనుమానం

ఆదిలాబాద్‌టౌన్: కష్టపడి చదివి పరీక్షలు రాయాల్సిన కొందరు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌ను నమ్ముకుంటున్నారు. స్క్వాడ్లకు పట్టుబడిత వారితో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇటీవల జిల్లాలో ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. గతంలో ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష రాస్తున్న కొందరు విద్యార్థులకు స్క్వాడ్లకు పట్టుబడి వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత సైన్స్ డిగ్రీ కళాశాల, ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. తాజాగా బుధవారం ఇచ్చోడలో స్క్వాడ్ కారు అద్దాలను ధ్వంసం చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల తీరే విద్యార్థుల విపరీత ధోరణికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేట్ కళాశాలల తీరుతోనే..

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల తీరుతోనే విద్యార్థులు ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనంపై దాడి చేసినట్లు తెలుస్తోంది. తరగతులు నిర్వహించకపోయినా విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తూ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు అటెండర్లు, లెక్చరర్లకు డబ్బులు ఇవ్వడంతో వారిని చూసీచూడనట్లుగా వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. స్క్వాడ్ వచ్చినపుడు పట్టుబడిన విద్యార్థులు వీరి బండారం బయటపెడుతున్నారు. గతంలో ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇలాగే జరిగింది. కళాశాల లెక్చరర్లకు డబ్బులు ఇచ్చామని పరీక్షా కేంద్రం నుంచి వెళ్లేదే లేదని పలువురు విద్యార్థులు స్క్వాడ్లతో వాగ్వాదానికి దిగారు. జిల్లాలో అప్పట్లో ఇది చర్చనీయాంశమైంది. బుధవారం ఇచ్చోడలో జరిగిన ఘటనలో కూడా ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఫ్లయింగ్ స్క్వాడ్ కారు అద్దాలు ధ్వంసం చేసినట్లు సమాచారం.

మాస్‌కాపీయింగ్ పాల్పడొద్దు

డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 4న ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 60 మందికిపైగా విద్యార్థులు డిబార్ అయ్యారు. బుధవారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 24 మంది డిబార్ కాగా, ఇందులో ఇచ్చోడలో 20 మంది, భైంసాలో ముగ్గురు, రెబ్బెనలో ఒకరు ఉన్నారు. ఇచ్చోడలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులను డిబార్ చేయగా, ముగ్గురు విద్యార్థులు స్క్వాడ్ కారుపై దాడికి పాల్పడ్డారు. వీరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాయాలి. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే భవిష్యత్‌ను కోల్పోతారు.
– నరేందర్, కేయూ పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్

కొత్త సీఎస్‌తో జిల్లాకు ప్రత్యేక అనుబంధం

- కలెక్టర్‌గా జిల్లాపై చెరగని ముద్ర
- గుర్తు చేసుకున్న జిల్లావాసులు
- శాంతికుమారి సేవలపై ప్రశంసలు



శాంతికుమారి

కైలాస్‌నగర్: రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నియమితులైన ఏ శాంతికుమారికి ఆదిలాబాద్ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30.04.1999 నుంచి 11.11.1999 వరకు ఆమె ఉమ్మడి ఆదిలాబాద్ కలెక్టర్‌గా సేవలందించారు. పనిచేసింది తక్కువ కాలమే అయినా ఆమె జిల్లాపై చెరగని ముద్రవేశారు. పత్తి సాగుకు ఆసియాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన జిల్లాలో కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలను గుర్తించారు. కొనుగోళ్లలో పారదర్శకతను పెంచేందుకు ఎలక్ట్రానిక్ కాంటాలను ప్రవేశపెట్టారు. దీంతో రైతుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. ఈ నిర్ణయాన్ని తట్టుకోలేని వ్యాపారులు రాజకీయంగా ఒత్తిడి తీసుకురాగా అప్పటి ప్రభుత్వం ఆమెను బదిలీ చేసింది.



కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో శాంతికుమారితో తహసీల్దార్లు

నిజాయితీ గల అధికారి బదిలీని ఆపాలంటూ తొలిసారిగా రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయడం ఆమె పనితీరుకు అద్దం పట్టగా ఈ విషయం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అలాంటి అధికారి ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు చేపట్టడంతో జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. శాంతికుమారి సీఎస్‌గా నియమితులు కావడంతో జిల్లా వాసులు ఆమె పనితీరును గుర్తు చేసుకుంటున్నారు. వాట్సాప్ స్టేటస్, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతూ ఆమెపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగేశ్ కుటుంబీకులకు నగదు ఇస్తున్న కానిస్టేబుళ్లు

బజార్‌హత్నూర్/ఆదిలాబాద్‌అర్బన్: బజార్‌హత్నూర్ మండలం దేహెగాం గ్రామానికి చెందిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉయిక నగేశ్ ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో మరణించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అతడి బ్యాచ్‌మెట్లు ఆర్థికసాయం అందించారు. బుధవారం పెద్దకర్మ సందర్భంగా అతడి కుటుంబాన్ని పరామర్శించారు. నగేశ్‌కు ఇద్దరు కూతుళ్లు కాగా, ఒక్కొక్కరి పేరిట రూ.లక్ష చొప్పున సుకన్య సమృద్ధి యోజన పాలసీలో డబ్బులు జమ చేశారు. అలాగే మరో రూ.15వేల నగదు అందజేశారు. మున్ముందు నగేశ్ కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసా కల్పించారు.

పత్తి క్వింటాల్‌కు రూ.10 వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నటరాజ్

ఆదిలాబాద్‌టౌన్: క్వింటాల్ పత్తికి రూ.10వేలు చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నటరాజ్ బుధవారం వ్యవసాయ మార్కెట్, సీసీఐ అధికారులు, సీపీఎం ప్రతినిధులతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలులో సీసీఐ ధర తక్కువ కేటాయించడంతో ఇదే అదనుగా తీసుకున్న ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లించి పంట కొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మహారాష్ట్రలో రూ.8,500 తో కొనుగోలు చేస్తున్నా ఇక్కడ రూ.7,960 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీడాది పంటల సాగుకు పెట్టుబడి అధికంగా పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం చెల్లించే ధరతో రైతులకు గిట్టుబాటు కాదని పేర్కొన్నారు. గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యుడు సురేందర్, నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే జీవితం

- శాస్త్రీయంగా ఆలోచించాలి
- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మానక్
- జాతీయస్థాయికి 26 ప్రాజెక్టులు ఎంపిక
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మొదటి బహుమతి పొందిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి ఐకేరెడ్డి



ఎంపికైన విద్యార్థులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

నిర్మల్‌టౌన్: సైన్స్ లేనిదే జీవితం లేదని, నిత్యం మనం చేసే ప్రతీ పనిలో సైన్స్ అంతర్లీనంగా ఉంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్‌మానక్ ప్రదర్శన బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఉత్తమంగా నిలిచిన, జాతీయ స్థాయికి ఎంపిక చేసిన 26 ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక రంగాల్లో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతీ అంశాన్ని శాస్త్రీయంగా ఆలోచించాలని సూచించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ పోటీల్లోనూ రాణించి తెలంగాణ కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించే అవకాశం నిర్మల్‌కు రావడం అదృష్టమన్నారు. 33 జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో దేనికదే గొప్పగా ఉందని తెలిపారు. కొత్త కొత్త ఆలోచనలతో సృజనాత్మకతతో దేశానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేసిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సీనియర్ విభాగంలో మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు	
విద్యార్థి	పాఠశాల
సందీప్	అక్షర పాఠశాల (వికారాబాద్)
శ్రీహరిణి	పారమిత పాఠశాల (కరీంనగర్)
రోహిత్	జెడ్పీహెచ్‌ఎస్ (నిజామాబాద్)
నక్రుమత్	జెడ్పీహెచ్‌ఎస్ (సిద్దిపేట)
వంశీకృష్ణ	విజయ పాఠశాల (నిజామాబాద్)
రామ్‌చరణ్	జెడ్పీహెచ్‌ఎస్ (వికారాబాద్)
గణేశ్	టీఎస్ఎంఎస్ పాఠశాల (హనుమకొండ)

కలెక్టర్ ముషరఫ్ అలీ మాట్లాడుతూ.. జీవితంలో సైన్స్ ఒక భాగమైందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలు పాఠశాలల విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా, పండుగల విశిష్టతను తెలిపేలా ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఈవో రవీందర్‌రెడ్డి, సైన్స్ అధికారి సురేశ్‌బాబు, శాస్త్ర సాంకేతికశాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీపీ రమేశ్వర్‌రెడ్డి, డాక్టర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రముఖులు పాల్గొన్నారు.

జూనియర్ విభాగంలో మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు	
విద్యార్థి	పాఠశాల
కె.యశ్వంత్	ఆదర్శ పాఠశాల (జయశంకర్ భూపాలపల్లి)
శ్రీపాద	అల్ఫోర్స్ పాఠశాల (వరంగల్)
మన్విత‌రెడ్డి	ఏకశిల టెక్నో స్కూల్ (హనుమకొండ)
వర్షిత	డిస్నీ ల్యాండ్ స్కూల్ (హనుమకొండ)
రక్షిత	జెడ్పీహెచ్‌ఎస్ రామన్న గూడెం (ములుగు)
పూజ	జెడ్పీహెచ్‌ఎస్ అహ్మదిపుర (సిద్దిపేట)
ఎండీ.రిజ్వాన్	మైనార్టీ పాఠశాల (భూపాలపల్లి)

జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు..

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో 33 జిల్లాల నుంచి 257 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో 26 ప్రాజెక్టులను న్యాయ నిర్ణేతలు జాతీయస్థాయికి ఎంపిక చేశారు.

ఆ ప్రాజెక్టులు.. క్లిక్ పేపర్ పెన్ (జరహా ఆసిఫ్), హ్యాండ్ స్టిక్ (చింతల నవీన్), హెల్పింగ్ హ్యాండ్స్ (సహస్ర), ఎగ్ షెల్ రిమూవర్ (సమరత), కూలింగ్ సీలింగ్ ఫ్యాన్ (సాన్విత), ఆండ్రాయిడ్ మొబైల్ కంట్రోల్డ్ లైక్ వాయిస్ (శైలజ), ఆటోమేటిక్ స్టాప్ వాటర్ హీటర్ (సిద్దు), బ్రిక్ కౌంటింగ్ మిషన్ (విగ్నేశ్‌కుమార్), స్పీచ్ టు బ్రెయిలీ (రూప్సీబాయి), పెల్ టీయర్ బ్లాంకెట్ (అర్షిత‌రెడ్డి), చిల్డ్రన్స్ లైఫ్ సేవర్ ఇన్ ట్రైన్ స్లీపర్ క్లాస్ (రమ్య కృష్ణ), లైఫ్ సేవర్ వైపర్ (స్వాతి), డ్రైవింగ్ షీట్ ఫర్ గ్రైన్స్ (తేజస్విని), గ్రైన్ ప్రొటెక్టర్ (మణిప్రసాద్), డ్రైవింగ్ అండ్ రోడ్ క్లీనర్ (కుషీంద్ర), యాంటీ పాండమిక్ వాటర్ బాటిల్ (హర్షిత), బోండా మేకింగ్ మిషన్ (శ్రీనిధి), మష్రూమ్స్ అండ్ ఎకలాజికల్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్స్ (ఉమాదేవి), సింపుల్ కెన్ క్లీనర్ (ధర్మేశ్), సేఫ్ లాకింగ్ అండ్ లాకింగ్ సిస్టం ఆఫ్ ఇన్సైడ్ మెయిన్ ఎంట్రెన్స్ డోర్ (నాగరాజు), క్రాప్ డ్రయ్యర్ మిషన్ (మహ్మద్ కషిఫ్), రూఫ్ టఫ్ గ్యాడెజ్ (హసిత), లోకాస్ట్ బోర్‌వెల్ కేసింగ్ (ఆఫ్రీన్), పవర్ థ్రెస్ట్ డిటెక్షన్ అండ్ ఇంటిమేషన్ ఎనర్జీ మీటర్ (గణేశ్), అడ్జస్ట్ టేబుల్ గ్యాస్‌స్టౌ (నందిని), ఆటోమేటిక్ వెజిటేబుల్ కట్టర్ (పూజ).

క్లుప్తంగా

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

కుభీర్(ముథోల్): మద్యానికి బానిసై వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రమైన కుభీర్‌కు చెందిన ఆకుల బాలాజీ(52) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం గ్రామ శివారులోని రావిచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

అధికారులపై దాడికి యత్నించిన పలువురిపై కేసు

ఇచ్చోడ(బోథ్): అటవీశాఖ అధికారులపై దాడికి యత్నించిన సర్పంచ్ భర్తతో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిరిచెల్మ టైగర్‌జోన్ పరిధిలోని చిలుకగూడ ఆర్‌వోఎఫ్‌ఆర్వోలో బుధవారం కొంత మంది అక్రమంగా బావుల తవ్వకం చేపట్టినట్లు సమాచారం అందడంతో ఇచ్చోడ టైగర్ జోన్ ఎఫ్‌ఆర్వో వాహబ్ అహ్మద్ సిబ్బందితో కలిసివెళ్లి అడ్డుకున్నారు. దీంతో సదరు గ్రామస్తులు అధికారులపై దాడికి యత్నించారు. అంతేకాకుండా అధికారుల జీపును సైతం పెట్రోల్ పోసి నిప్పంటిస్తామని భయభ్రాంతులకు గురిచేశారు. ఘటనపై ఎఫ్‌ఆర్వో వాహబ్ అహ్మద్ ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో సిరిచెల్మ సర్పంచ్ భర్త గుండాల కన్నమయ్యతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకా చింపోలి తాండా గ్రామానికి చెందిన రాథోడ్ దశరథ్ అలియాస్ సంతోష్ (49) రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసైన సంతోష్ ఈ నెల 10న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కేకు చెందిన అబ్దుల్ రవూఫ్‌పై ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్‌కు చెందిన షేక్ మతీన్, షేక్ మోసిన్, షమీమ్ బుధవారం దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై విష్ణు ప్రకాశ్ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కేఆర్‌కేకు చెందిన అబ్దుల్ రవూఫ్ కూతురు ఆయిషా సిద్దిఖాతో ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌కు చెందిన షేక్ మోసిన్‌తో వివాహం జరిగింది. తరచూ కుటుంబ సభ్యులు వేధిస్తుండడంతో ఆమె కొన్ని రోజులుగా పుట్టింట్లోనే ఉంటోంది. బుధవారం అబ్దుల్ రవూఫ్ ఖుర్షీద్ నగర్‌లో ఉండగా ఆయన అల్లుడు షేక్ మోసిన్‌తో పాటు ఆయన తల్లి షమీమ్, సోదరుడు షేక్ మతీన్‌లు అక్కడికి చేరుకొని దాడికి దిగారు. తన భార్యను కాపురానికి పంపించాలని తెలుపగా పెద్ద సమక్షంలో పంపుతానని చెప్పడంతో మాటమాట పెరిగి దాడికి దారి తీసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌ను దుర్భాషలాడిన ముగ్గురు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రం కబూతర్ కమాన్‌లోని గుట్ట ప్రాంతంలో నీటి ఎద్దడిని గుర్తించిన మున్సిపల్ అధికారులు ఇటీవల విద్యుత్ నీటిమోటార్ ఏర్పాటు చేశారు. ఈ నెల 10న రాత్రి అదేకాలనీకి చెందిన షేక్ అఖిల్, షేక్ అల్మాస్, షేక్ నదీమ్ అనే ముగ్గురు యువకులు మద్యం మత్తులో మోటార్‌ను ధ్వంసం చేశారు. ప్రశ్నించిన స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ అధికారులను దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

సెల్యూట్.. హైమన్

- ఆత్మబంధువుకు ఘన నివాళి
- మార్లవాయిలో డార్ఫ్ దంపతుల వర్ధంతి
- హాజరైన ఎంపీ, ఐటీడీఏ పీవో, జెడ్పీచైర్ పర్సన్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు



ఎంపీ సోయం బాపురావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆదివాసీలు



డార్ఫ్ దంపతులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యేలు

నార్నూర్(ఆసిఫాబాద్): ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టీ ఎలిజబెత్ దంపతులకు బుధవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయిలో ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పుణ్యదంపతుల 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కుమురంభీం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎంపీ సోయం బాపూరావు, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గెడం నగేశ్‌తో పాటు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ముందుగా గ్రామ పటేల్ ఇంటిముందు నుంచి డార్ఫ్ దంపతుల సమాధుల వద్దకు ర్యాలీగా వెళ్లి ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుమురంభీం, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టీ ఎలిజబెత్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు.

ఏడాదిలోగా రైతులకు పోడు పట్టాలు

దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు ఏడాదిలోపు పట్టాలు అందజేస్తామని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పోడు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వేలు పూర్తి అయ్యాయన్నారు. ఏడాదిలోపు పోడు రైతులకు పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదివాసీలను పట్టించుకోని ప్రభుత్వం

ఆదివాసీలు అన్ని రంగాల్లో సహకరించాలంటే విద్య, వైద్య పరంగా అభివృద్ధి చెందాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివాసీలు ఎన్నో ఎళ్లుగా ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివాసీలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు అన్యాయంగా లాక్కుంటున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలని సూచించారు. పోడు భూములతో పాటు అటవీహక్కు పత్రాలు అందజేసినప్పుడే మహనీయుల ఆశయం నెరవేరుతుందన్నారు.

వేదికపై రాజకీయాలు సరికాదు

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపిన హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి వేదికను రాజకీయ వేదికగా మార్చేందుకు ఎంపీ ప్రయత్నించడం సరికాదని జెడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే సరైన గుర్తింపు వచ్చిందన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడాలి

ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుతూనే విద్యావంతులు కావాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమన్నారు. యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

డార్ఫ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆదివాసీల అభివృద్ధి కోసం డార్ఫ్ దంపతులు చేసిన కృషి గొప్పదని కుమురంభీ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఆదివాసీల జీవితాలు బాగుపడాలని డార్ఫ్ దంపతులు ఆశించారని, మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే వారికి నిజమైన ఘన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఐటీడీఏ పాలక మండలి చైర్మన్ కనక లక్కేరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఇంతియాజ్‌లాల, ఎంపీపీ కుమ్ర తిరుమల, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, నిర్వహణ కమిటీ చైర్మన్ కనక వెంకటేశ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'గిరి' గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద మార్లావాయి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. త్వరలో మార్లావాయిలో గుస్సాడీ శిక్షణ కేంద్రం నిర్మించి, శిక్షణ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్జీయూకేటీలో త్యాగరాయ వర్ధంతి



నివాళులర్పిస్తున్న డైరెక్టర్ సతీశ్ కుమార్

బాసర(ముధోల్): బాసర ఆర్జీయూకేటీ కల్చరల్ అండ్ సోషల్ ఆక్టివిటీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాయ స్వామి 176వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ సతీశ్‌కుమార్ హాజరై త్యాగరాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరామునిపై భక్తిని, వేదాలు, ఉపనిషత్తులపై అతనుకున్న జ్ఞానం త్యాగరాయ కీర్తనల ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ అండ్ సోషల్ ఆక్టివిటీ క్లబ్ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, వీణ అధ్యాపకులు మల్లెల వెంకట రమణ, గోవిందమూర్తి, డాక్టర్ బాలకృష్ణ, సురేశ్, వేదభారతి విద్యార్థులు, వీణ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ మార్కెట్ కమిటీ గదులకు వేలం

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని పది గదులకు గానూ బుధవారం ఐదు గదులకు వేలం నిర్వహించారు. మార్కెట్ కమిటీలో నెలకొన్న సమస్యలపై మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మన్ సింగ్ జిల్లా మార్కెట్ అధికారి శ్రీనివాస్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లింబాజీ, వెంకటేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

జైనథ్(ఆదిలాబాద్): రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు నైతం గణేశ్ కోరారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాన్పుమేడిగూడ కెనాల్ స్కూల్ కాంప్లెక్స్‌లో సంఘం బాధ్యులు, ఉపాధ్యాయులతో కలిసి మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చుక్కా రామయ్య, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాన్పుమేడిగూడ కెనాల్ స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు, నాయకులు నారాయణ, దిలీప్, పెంటపర్తి ఊశన్న, భవాని ఆనంద్, దశరథ్, దిలీప్, రాములు, వినోద్, అరుణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న మంత్రి

ఖానాపూర్:గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో రూ.1.10 కోట్లతో నిర్మించిన గిరిజన భవన్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీర రేఖానాయక్, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ ముషరఫ్ అలీ, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడేతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మల్ జిల్లా ప్రస్తావనే లేని సమయంలో పోరాడి నూతన జిల్లాను సాధించుకున్నామన్నారు. ఖానాపూర్ ప్రాంతాన్ని ప్రభుత్వం అన్నివిధాలా అభివృద్ధి చేస్తుందన్నారు. సదర్‌మాట్ బ్యారేజీ పనులు సైతం త్వరలో పూర్తవుతాయన్నారు. కడెం ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరదలతో దెబ్బతిన్న రోడ్లను త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు.

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి...

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని మంత్రి కోరారు. ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న వంద రోజుల ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజలకు కంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ భవన్ కోసం మంత్రికి విన్నవించారు. దీంతో భవనం కోసం స్థలం కేటాయించడంతో పాటు రూ.25 లక్షలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అంతకుముందు కలెక్టర్‌తోపాటు అధికారులు గిరిజన భవన్ సమీపంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, ఎంపీపీ మోహిద్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, ఆర్డీవో స్రవంతి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై మెయిన్స్ పరీక్షలకు హాజరుకానున్న గిరిజన యువతకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మూడునెలల పాటు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ కె.వరుణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ ఫిట్‌నెస్ (పార్ట్–2) ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులు తమ ఫిజికల్ టెస్ట్, అడ్మిట్ కార్డుతో పాటు, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రవేశం పొందాలన్నారు. ఉచిత శిక్షణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 7893616392, 9493535052, నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కడెం'లో శిక్షణ ఎఫ్‌ఆర్వోల పర్యటన



అధికారులతో శిక్షణ ఎఫ్‌ఆర్వోలు

కడెం(ఖానాపూర్): హైదరాబాద్ సమీపంలోని దూలపల్లి అటవీ శిక్షణ అకాడమీకి చెందిన 47 మంది శిక్షణ ఎఫ్‌ఆర్వోలు బుధవారం కడెం అడవుల్లో పర్యటించారు. గంగాపూర్ వాచ్ టవర్లను సందర్శించారు. గడ్డి క్షేత్రాలు, నీటి తొట్టిలు, అటవీ, వన్యప్రాణి సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఎఫ్‌డీవో కోటేశ్వరావు వారికి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో అనిత, అకాడమీ అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 9నుంచి 11వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి మహ్మద్ కాషీఫ్ ఇన్‌స్పైర్ పోటీల్లో డ్రాప్ డ్రయర్ ఇన్నోవేషన్‌కు గానూ విజేతగా నిలిచాడు. సైన్స్‌ఫేర్ పోటీల్లో తాంసి జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు జి.కార్తీక్, ఎ.అన్వేష్ సేవ్ ద ఎలక్ట్రిసిటీ ఇన్నోవేషన్‌కు బహుమతి అందుకున్నారు. ఇచ్చోడ టీడబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు జి.కిరణ్, జే.వినయ్ బయో డైవర్సిటీ ఇన్నోవేషన్‌కు అవార్డు పొందారు. విద్యార్థులను డీఈఓ టి.ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి కె.రఘురమణ అభినందించారు.

రేషన్ బియ్యం పంపిణీ షురూ

కైలాసనగర్: జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద అందించే ఉచిత రేషన్ బియ్యం పంపిణీ ఎట్టకేలకూ బుధవారం ప్రారంభమైంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా సాంకేతిక కారణాల రీత్యా ఈ నెలలో ఆలస్యమైంది. ఎఫ్ఎస్‌సీ కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందించాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవి అందిన వెంటనే అధికారులు రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు పది కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందజేయనున్నట్లు డీఎస్ఓ టి.కిరణ్‌కుమార్ తెలిపారు.

మాణిక్‌రావుని కలిసిన 'ఏలేటి'



మాణిక్‌రావుతో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుథాక్రేను ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం గాంధీభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, కాంగ్రెస్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

ప్రతిభ గల క్రీడాకారులకు అవకాశాలు పుష్కలం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: ప్రతిభ గల క్రీడాకారులకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ఆదిలాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన బాలుర సబ్ జూనియర్ జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల హాకీ క్రీడాకారులు ఉన్నారని, వారికి హాకీ పై గల మక్కువ కారణంగానే జిల్లాలో హాకీ ఖేలో ఇండియా సెంటర్ మంజూరైందన్నారు. ఒడిశాలో జరగనున్న హాకీ వరల్డ్ కప్‌లో అత్యధికంగా గిరిజన క్రీడాకారుల ప్రాతినిధ్యం ఉందన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లా క్రీడాకారులు సైతం జాతీయస్థాయికి ఎదగడానికి నిరంతరం సాధన చేయాలన్నారు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23 వరకు రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు అతుల్ కుమార్, శ్రీనివాస్, శేఖర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ నెల 21న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభించనున్న కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. శాశ్వత మరుగుదొడ్ల మరమ్మతులు పూర్తికాగా తాత్కాలిక మరుగుదొడ్ల పనులు కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకు వద్ద సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి మురుగునీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ముత్నూర్ నుండి కేస్లాపూర్ రోడ్డుకు మరమ్మతు చేస్తున్నారు. బుధవారం పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్ ఏర్పాట్లు పరిశీలించారు.

'కంటి వెలుగు' ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాట్లను రాష్ట్ర పరిశీలకులు జాన్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తించాలన్నారు. ఆయన వెంట టీబీ, లెప్రసీ జిల్లా అధికారి డాక్టర్ శ్రీకాంత్, ఆప్తమిక్ ఆఫీసర్ లింగేష్, అంకోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం అబాసుపాలు






రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం అబాసుపాలవుతోంది. అవగాహన లేని అధికారులు విద్యుత్ స్తంభాల కింద మొక్కలు నాటుతుండడంతో అవి పెరిగిన తర్వాత మళ్లీ నరికేయాల్సిన పరిస్థితి. అంతే కాకుండా మంత్రి ఐకేరెడ్డి స్వగ్రామమైన ఎల్లపెల్లికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటిన అధికారులు వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో మొక్కలు ఎండిపోవడంతో ట్రీగార్డులు పడిపోయి కనిపిస్తున్నాయి. వాటిని పట్టించుకునే వారే కరువయ్యారని పర్యావరణ ప్రేమికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదస్థలంలో కారు



అనిల్(ఫైల్)

సారంగాపూర్(నిర్మల్): నిర్మల్ రూరల్ మండలంలోని డ్యాంగాపూర్ బస్టాండ్ ఎదురుగా బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండకు చెందిన పెరుమాండ్ల అనిల్ (28) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నేరడిగొండకు చెందిన తక్కల్లపల్లి విక్రమ్‌కు నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రానికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. త్వరలోనే పెళ్లి ఉండటంతో వడూర్‌కు చెందిన తన స్నేహితుడి కారులో ఫొటోగ్రాఫర్ పెరుమాండ్ల సురేష్‌ను వెంట తీసుకుని ఫొటోషూట్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో తమ ఫొటోషూట్ ముగించుకుని నేరడిగొండకు తిరిగి వెళ్తున్న క్రమంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో సురేష్‌కు సమీప బంధువైన పెరుమాండ్ల అనిల్ కలవడంతో ఆయనను సైతం కారులో కూర్చొబెట్టుకుని ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో డ్యాంగాపూర్ గ్రామానికి చేరుకోగానే ముందుమంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడానికి యత్నించాడు. రెండు వాహనాలు ఒకేవైపు రావడంతో కారును పక్కకు తప్పించే ప్రయత్నంలో ఎదురుగా ఉన్న కట్టెల మండెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా సురేష్, విక్రమ్‌లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన 108కి ఫోన్‌చేసి క్షతగాత్రులను నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సారంగాపూర్, నిర్మల్ రూరల్ మండల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.